# బోయ్ మీట్స్ గర్ల్

ఇంజనీరింగ్ చదువుతున్న చక్రిపాణి, అందాలరాసి అయిన ఇందిరకోసం, ఆరుపాటల పుస్తకాలుకొని తేవడమే కాకుండా సినిమా పూర్తయేలోపున ఆమె సంగతి తెలుసుకు, తన చరిత్ర చెప్పేస్తాడు. క్షణికమై శాశ్వితమగు మధురానుభూతి వారిది. వెన్నెల కాంతులలో ఆమె పక్కని నడుస్తూంటే జీవితమంతా అలానే నడవాలనిపించిందట, పాపం చక్రిపాణికి. సన్నజాజులు వొదిలివెళ్ళిన ఇందిరమాత్రం సరసమెరిగిన సారసాక్షి.

సినిమాలో యుగళ గీతం జోరుగా పాడుకుంటున్నారు ప్రేయసీ ప్రియులు. చల్లనిగాలిలో ఎన్నో విరిసిన పూవుల మధ్య చిన్న పిల్లకాలువమీదున్న చెక్కవంతెనమీద పరుగెట్టుకుంటూ చేతికి అందీఅందినట్లుగా హీరోయిన్, హీరోను అలరిస్తుండగా వుస్సురని నిట్టూర్చాడు థర్డ్ ఇయర్ బి. ఇ. స్టూడెంటు చక్రిపాణి. అతనికి ఇంజనీరింగ్ కోర్స్ అంటే తలనొప్పి. ఇంటరులో 'క్లాసు' రాకపోయినా అతని తండ్రి మినిష్టరుకి దగ్గిర బంధువవటంనించి, అతను ఇంజనీరింగ్ కోర్సు చదవక తప్పలేదు! అతను అలభ్యమవుతుందనుకున్న బి. ఇ. సీటు వచ్చినందుకు ఏమాత్రం సంతోషం పొందలేదు. కార

ణం ఇంజనీరింగు కాలేజీలో అమ్మాయిలు లేకపోవటమే. కనీ సం క్లాస్ రూమ్స్ వూడ్చేందుకైనా ఒక 'చీర' లేదు. కాలేజీ ఆవరణదాటి 'బస్‌స్టాప్' దగ్గరకు వచ్చేదాకా ఆ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల కళ్ళునొప్పి పుట్టుతోనే వుంటాయ్. పరీక్ష ప్యాసయ్యాక వచ్చే జీతంమాట దేముడెరుగును. కాని, వాళ్ల మనస్సుకి మాత్రం రిలీఫ్ వుండదు. స్టాఫ్ అంతా మగవాళ్లే. అయిదారు వందలమంది మసులుతున్నా ఎవళ్లమటుకువాళ్ళే ఏదో నిర్జనారణ్యంలో వున్నట్లు భావిస్తారు.

హాయిగా తీయగా పాడుకుంటూ పరుగులుతీస్తున్న తెరమీద జంటని చూడగానే చక్రపాణి మనస్సు అల్లకల్లోల మయింది. సరిగ్గా 'ఫాన్' క్రిందే కూర్చున్నా అతని ముఖము చమటతో తడిసిపోతోంది. బుష్‌షర్టు లోపల మెడచుట్టూ వున్న రుమాలుతో ముఖం తుడుచుకోబోతూ జాజిపూల వాస నకి అదిరిపడ్డాడు. క్షణంలో సగంకాలంలో తన ప్రక్కన ఒక అమ్మాయి కూర్చున్నదని ధృవపరచుకున్నాడు. ఇంటర్వెల్ లో దీపాలు వెలిగినప్పుడు ఆ అమ్మాయికేసి ఓరగా చూసాడు.

పింపుల్స్‌వేసి మానిపోయిన పచ్చని చెక్కిళ్ళమీద దళసరిగా పులిమిన పౌడరు ఆమె వయస్సుని మభ్యపరచటానికి ప్రయత్నించి విఫలమై నుసిగా రాలిపోబోతోంది! నల్లగా వొత్తుగావున్న జుట్టుని వెనక్కి మడిచి ఎర్రటి రిబ్బనుతో కట్టుకున్నది! చెవులకి బెంగాలీ రింగులు! ఆ అమ్మాయి పాటల పుస్తకాలమ్మే కుర్రాణ్ని కేకేస్తోంది. వాడు విన్పించుకోవ టం లేదు. ఆ అమ్మాయి ఎంతగా పిల్చినా ఆ కుర్రాడు

విన్పించుకోలేకపోతే నిస్సహాయంగా చక్రపాణికేసి చూసింది. చక్రపాణికి ఎంతో జాలేసింది. ఆ కుర్రాడు 'బెంచీ' క్లాసు వాళ్ళదగ్గరే తారట్లాడుతున్నాడు. ఈ అమ్మాయి కోమల స్వరం 'బాల్కనీ' దాటి క్రిందకు వెళ్ళటంలేదు. తన 'షివల్రీ' చూపెట్టటానికి మంచి అదును అనుకున్నాడు. సర్రుమని క్రింది కెళ్ళి అరడజను పాటల పుస్తకాలు కొనిపట్టుకొచ్చాడు. ఎంతో వినయంగా ఆమెకియ్యబోయాడు.

"ఇన్నెందుకు ఒకటిచ్చాలు !" అంది పది నయాపైసల నాణెం అతని అరిచేతులో వుంచుతూ.

"నో! నో! థాంక్స్!" ఆ నాణెం మళ్ళీ ఆమె చేతిలో పెట్టాడు పాణి. ఆ నాణెం ఇద్దరి చేతుల్లోనూ కాస్సేపు తిరిగి చివరికి గునుస్తూ సోఫా కవరు జాయింటు చేసినచోట ఇరుక్కుంది.

"ఏకంగా అన్ని కొనేసారేమి? నే నొక ర్తినేకా పుస్తకం కావాలనుకుంటూ?" బాల్కనీ అంతా కలయచూస్తూ డ్రింక్ "సిప్" చేస్తూ అన్నది.

"అబ్బే, మా చెల్లెళ్ళకి" అన్నాడు పాణి.

"అందరికీ ఒక పుస్తకం చాలదూ?"

"ఊహుఁ, వాళ్ళలో వాళ్ళు కుమ్ముకుంటారు."

మళ్ళీ "షో" ప్రారంభమైంది. కాని చక్రపాణి 'యుగళ గీతం' పాడుకున్న ప్రేయసీప్రియులు విలన్‌వల్ల విడిపోవటం, హీరో పొలిటికల్ స్టంట్లు, చివరికి పవిత్రప్రేమ విజయం చూడనేలేదు. సినిమా ఆఖరయ్యేదాకా వరప్రసాదంలా దొరికిన ఆ అమ్మాయి వివరాలు సేకరించటంతో సరిపోయింది

దతనికి. ఆ అమ్మాయ్ కూడా చాలా బుద్ధిమంతురాలల్లే వుంది. అతను అడిగిన ప్రశ్నలన్నిటికీ కుదురుగా జవాబు లిచ్చింది. తత్ఫలితంగా ఆ అమ్మాయి పేరు ఇందిర అనీ, ఆర్ట్స్ కాలేజీలో ఫోర్త్ ఇయర్ చదువుతున్నదనీ తేలింది. ఇద్దరూ ఒకళ్ళ గురించి ఒకళ్ళు తెలుసుకుంటూ హాలులో నించి బయటపడ్డారు. ప్రక్క హోటల్లోంచి "జబ్ రాత్ హై ఐసీ మత్ వాలీ - ఫిర్ సుబహ్‌కా ఆలం క్యాహోగా" అని వినవస్తోంది. ఆమె చలించినట్లుగా అతని కేసి కళ్లు అర మోడ్పుతో చూసింది.

"మీతో ఇంకెవరన్నా వచ్చారా?"

"లేదు" అన్నది, ముక్తసరిగా.

"మరి అంతదూరం వొంటిగా వెళ్తారా?"

అతని కేసి తమాషాగా చూసింది.

"సెకండ్ షో కూడా చూద్దామని" నవ్వింది ఇందిర. రోడ్డుమీదజనం పల్చబడుతున్నారు. వెన్నెల వర్షంలాకురుస్తున్నది. గ్రీన్ ట్యూబ్ లైట్ల వెలుతురులో, వీళ్ళిద్దరి కేసీ ఈర్ష్యగా చూస్తున్న కిళ్ళీషాపువాడు ఒక "కస్టమరు" సిగరెట్టు అడిగితే 'సోడా' 'టవ్' మనిపించాడు.

"హాలత్ హై అ జబ్ దీవా నోంకీ అబ్ ఖైర్ నహీం పర్ వా నోంకీ"

లతామంగేష్కరు కంఠం రెట్టిస్తోంది.

"దేనికి పోదామంటారు? కొంచెం 'నాస్తా' తీసుకుంటే భాగుంట్టుందేమో" అన్నాడు చక్రపాణి.

"ఇప్పుడేం వొద్దులేండి. ఆ సంగతి ఇంటర్వెల్‌లో చూడొచ్చు" సన్నగా అన్నది ఇందిర, విజయా హాలు కేసి దారితీస్తూ.

చక్రపాణి మబ్బుల్లో విహరిస్తున్నాడు. కొబ్బరి ఆకుల చివరనించుని ఆకాశంలోని నక్షత్రాలన్నీ కోసుకుని జేబులో వేసుకున్నట్లు ఫీలయ్యాడు. అందరూ తమ కేసే చూస్తున్నట్లు, కళ్లల్లోంచి నిప్పులు రాలుస్తున్నట్లు భయపడ్డాడు. అయినా ఆమె సన్నటి గొంతులోంచి తీయగా వినిపిస్తున్న చిలక పలుకులకి, అతని మనస్సు సుషుప్తమవుతున్నది. బాక్స్‌లో ఇద్దరూ ప్రక్క-ప్రక్కల కూర్చుంటూ, కావాలనే ఆమె తల అతని భుజంమీదికి ఆన్చి కళ్లుమూసుకున్నది. సన్నటినైలాన్ స్ట్రాపుతోవున్న చిన్న రోలెక్స్ వాచీ ధరించిన ఆమె మృదు హస్తం అతని భుజం చుట్టూ నిమిరింది. వాళ్లిద్దరూ సినిమా పూర్తిగా 'ఎంజాయ్' చేయలేకపోయారు. ఒకళ్ల గురించి ఒకళ్ళు ఏవేవో తీయని తలపోతలతో, మనస్సులు మత్తెక్కి-పోగా అలానే కూర్చుండిపోయారు. పద్దెనిమిది రీళ్ల తెలుగు సినిమా పూర్తి అయ్యేసరికి ఠంచన్‌గా రెండయింది. ఇద్దరూ బయటికి వచ్చారు.

"రెండయింది" అన్నది ఇందిర. ఆమె గొంతు "కాల మెంత వేగంగా పరుగెట్టింది!" అన్న నిర్వేదం ధ్వనించింది.

"ఎవళ్లయినా 'థర్డ్‌షో' కూడా వేస్తే బాగుణ్ను" అన్నాడు చక్రపాణి.

"అం తెందుకు! ఇక్కణ్నించీ స్టేషను రెండుమైళ్లుం టుందికదా! మనిద్దరం అందాకా కలిసి నడిచిపోదాం. ఎటూ

వెళ్ళేసరికి నాలుగవుతుంది. అప్పుడే రెడీగావున్న పాసింజరు ఎక్కేస్తాను" అన్నది ఇందిర.

"రైలెక్కేయటవేం? మీరు ఈవూళ్లోకాదూ చదువు తోంట?"

"ఈ వూళ్లో కాదు."

ఇద్దరూ నడుస్తున్నారు. చక్రపాణి ఆమెకేసి చూసి నప్పుడల్లా ఆమె మందస్మితం చేస్తున్నది. అతను ముగ్ధుడవు తున్నాడు. స్టేషనులో కొచ్చారు. 'కాంటీన్'వాడు వొళ్ళు విరుచుకుంటూ 'కాఫీ' తయారుచేయటానికి తొందరపడు తున్నాడు. స్టేషన్‌మాష్టరు తలకి టర్కీ తువ్వాలుచుట్టుకుంటూ విసుక్కుంటున్నాడు. ఆమె అతనికేసి సూటిగాచూసి అతను చిత్తయిపోయేలాగా నవ్వింది చటుక్కున.

"ఇందాక మనిద్దరం కలిసి రోడ్డుమీద నడుస్తూంటే మీకేమనిపించింది?" అడిగింది.

"ముచ్చటేసింది, జీవితాంతమూ అలా నీతో నడవ గలగటమే నా జీవితధ్యేయం అవ్వాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటున్నా" తడుముకోకుండా జవాబిచ్చాడు చక్రపాణి.

"నన్ను గురించి, నా అందం గురించి, నా నడక గురించి మీకేం అనుమానాలు లేవూ?"

"ఏం లేవు ఇందూ! నిన్ను కలుసుకున్న తొలిక్షణాల మహత్తు అనుకుంటా!" పాణి కళ్లు తడి అయ్యాయ్. బుకింగు ఆఫీసు తీసారు. జనం త్రోసుకుంటున్నారు. చక్రపాణి ఫస్టు క్లాసు టికెట్టుకొని తెచ్చాడు.

"మరొక్కమాట డియర్ పాణీ! నన్ను గురించి ఏవన్నా వర్ణించరూ? మీ వర్ణన ఎలాగుంటుందో వినాలనుంది." పెదాలమధ్య నవ్వుని బిగించుకుంది.

"నువ్వు నాకళ్లకి వెలుగుతున్న టంగ్‌స్టన్ వైరులా వున్నావు. ఇందూ?"

"వాహ్వా! మీరు ఎలక్ట్రికల్ ఇంజనీరింగన్నమాట చదువుతోంట"

అతను ఆశ్చర్యపోయాడు. దేవకన్య కాదుకదా!

"నీకు జోస్యం వచ్చా, ఇందూ? అయితే నా హృదయం నీకు అవగతమయ్యే వుంటుంది. థాంక్ గాడ్" ఆనందంగా అన్నాడు.

"ఇందులో జోస్యానికేం వచ్చిందిలెండి. ఒకసారి నా వెనుకపడ్డ ఒక అబ్బాయిని ఇట్లాగే అడిగాను. అతను నా గుండ్రని ముఖాన్ని 'పూరీ'తోనూ, నా మృదుత్వాన్ని 'హల్వా'తోనూపోల్చాడు. అతను హోటలు ప్రొప్రయిటర్స్ సన్ అని గ్రహించేసాను. మీలాగే అతనూ ఆశ్చర్యపోయాడు పాపం"

చక్రపాణి బాధపడ్డాడు. రైలుకి సిగ్నలు ఇచ్చారు. అతనికి ఆమెను వదలాలనిపించలేదు. ఆమెతో కలిసి తిరిగిన క్షణాలలో తాను పొందిన అనిర్వచనీయ ఆనందానుభూతిని అతని మనస్సు మళ్లీ మళ్లీ ఆకాంక్షిస్తోంది! కాని ఆమెను పట్టి వుంచటమేలాగ! ఆమె వెళ్లిపోతే రైలుక్రిందపడి చచ్చిపోతానంటే ఆగిపోతుందేమో! రైలు ప్లాట్‌ఫారమ్ మీదికి వస్తోంది. ఇంక ఆగుతుంది. కేవలం ఆమెని ఎక్కించుకు పోవ.

టానికే ఆగుతుంది. అమె ఎక్కేయగానే తన విధ్యుక్త ధర్మము తను నిర్వర్తించాననే ధీమాతో బయలుదేరిపోతుంది. తన దేవత తనకి శాశ్వతముగా దూరమైపోతుంది. అతను భరించలేని వేదనతో చేతులెత్తి భగవంతునికి మ్రొక్కుతున్నాడు.

అతని ముఖముమీద చల్లని నీళ్లు జల్లినట్లు వుక్కిరిబిక్కిరవుతున్నాడు. నెమ్మదిగా కళ్ళు విప్పి చుట్టూ కలయ చూసాడు. ప్రక్క సోఫాలో సినిమాహాలు ప్రొప్రయిటరు ఆతురతతో అతని ముఖంలోకి చూస్తున్నాడు. బుకింగ్ క్లర్కు గేటుకీపర్సు బకెట్‌తో నీళ్ళు తెచ్చి, సీనారేకు డబ్బాతో అతని ముఖంమీద నీళ్ళు జల్లుతున్నారు. చక్రపాణి చేతు లడ్డంపెట్టుతూ లేచి కూర్చున్నాడు.

"మీరు దా ఫెయింటయినారు సామి! రొంబ కష్టం! మీ ప్రక్క ఆండకూతురు అడలెత్తి మాతో చెప్పిపోయింది. ఎట్లనా ఆలోచిస్తును" అన్నాడు సంబరంగా అయ్యరు. చక్రపాణి అతనికేసి విస్తుబోయి చూస్తున్నాడు. అతని చేతిలో సినిమా పాటల పుస్తకాలు తడిసిపోయి ముద్దగా అయ్యాయి. వాచీకేసి చూసాడు. పదిన్నర అయింది. బయట సెకండు షోకి వచ్చిన జనం యొక్క కోలాహలం విన్పిస్తోంది, చక్రపాణి నెమ్మదిగా లేచి అయ్యరుగార్కి 'థాంక్స్' చెప్పి బయటకు వస్తూ జేబు తడుముకున్నాడు. జేబులో పర్సు బదులు సన్నజాజి పూలమాల వుంది!